# ఆరోగ్యమే మహాభాగ్యం

నేడు ప్రపంచాన్ని గడగడలాడిస్తున్న మహమ్మారి కరోనా మనుషులను యింటికే పరిమితం చేసింది. యిల్లే వైకుంఠం- పంచభూతాల పరిరక్షణే మన ప్రాణం అన్నట్లుగ నేడు మనం ప్రవర్తించవలసి వస్తుంది. నిజానికి మన వేదవేదాంగాదులు పంచభూతాలను వివిధరీతులలో స్తుతించాయి. పంచభూతాలను పరిశుభ్రం చేసే వివిధ యాగాలను ఒకప్పుడు భారతదేశం చేసేదని గతచరిత్ర చెబుతుంది. కాల వికాసంలో గతం గతంలోకి వెళ్ళిపోయింది. మనిషి ఉరుకులపరుగుల జీవితంతో తనూ,తనకుటుంబం బాగా ఎదగాలని, గాలికంటే వేగంగ పయనించాలని ప్రయత్నిస్తున్నాడు. గతంకన్నా వర్తమానం మిన్న - బ్రతుకంటే భవిష్యత్తేనన్న అన్నట్లు ముందుకు సాగిపోతున్నాడు. అయితే మనిషి యిక్కడొక సత్యాన్ని మరిచిపోతున్నాడు. అదేమంటే కాలం గతంనుంచే వర్తమానానికి వచ్చిందన్న విషయం; నేడెక్కువమంది గతమంతా గాలికబుర్లే అంటున్నారు. కొందరు గతాన్ని సమర్థించినా, అది ఉపన్యాసాలకే పరిమితమవుతుంది. మరి కొందరు గతంలోని మహానుభావులు జరిగేవన్నీ చెప్పేసారు అంటున్నారు. వీరబ్రహ్మేంద్రస్వామివారు ఈశాన్య దిక్కున విషగాలి పుట్టేను --లక్షలాది ప్రజలు చచ్చేరయ-- కోరంకియను జబ్బు కోటిమందికి తగిలి - కోడిలాగ తూగిసచ్చేరయ- అని అప్పుడే కరోనాగురించి చెప్పారంటున్నారు. ఎవరేం చెప్పారన్నది ప్రస్తుతం అప్రస్తుతం;

1960 లోనే చైనాలో లీవెన్లీయాంగ్ అనే శాస్త్రవేత్త కరోనా వ్యాథిగురించి తెలుసుకున్నాడు. మరి అప్పటినుండి ఇప్పటివరకు కరోనా వ్యాధికి మందు ఎందుకని కనిపెట్టలేదు? ప్రస్తుతం మనముందున్న ప్రశ్న యిది. మన ప్రధానమంత్రి మాన్యులు మోడీగారు భారత ప్రజలందరి చేత,ఒకసారి తప్పట్లు కొట్టించారు. మరొకసారి దీపాలు వెలిగింపచేసారు. ఈ కార్యక్రమానికి దీపంపరంజ్యోతి అని దీపంధూపం పవిత్రం అనీ ఒక్కొక్కరూ ఒక్కొక్క అర్థాన్ని చెబుతున్నారు.

లంఖణం పరమౌషధం కాబట్టి ఒకపూట పస్తు ఉండాలి; యింటిని పరిశుభ్రంగ ఉంచుకోవడానికి పసుపు నీళ్ళు చల్లాలి. శరీరాన్ని పరిశుభ్రంగ

ఉంచుకోవడానికి తులసితీర్థం పుచ్చుకోవాలి అనే అంశాలు మనముందుకు వచ్చినా ఆశ్చర్యం లేదనిపిస్తుంది. అయితే ఒకప్పుడు యివన్నీ నిత్యజీవితంలో భాగాలు. అలాంటివాటిని ఏదో ఒకరోజు ఆచరిస్తే గుణం కనపడుతుందా? యింతవరకు బాగానే ఉంది. నేడు కొందరు నాఫేస్ బుక్, నా ట్విట్టర్, నా యూట్యూబ్ నాయిష్టం అన్నట్లు ప్రజలను అవాస్తవాల్లోకి తీసుకువెళుతున్నారు.ఇది క్షమించరాని నేరం; సంప్రదాయ శాస్త్రీయ మేథస్సులన్నీ చక్కగ కలిస్తే కరోనాకు మందు మనకళ్ళముందుంటుంది. కాస్త శాస్త్రీయంగ ఆలోచించేవారు తమ తమ అమూల్యమయిన ఆలోచనలను పరులతో పంచుకుంటే సాధించలేనిదేమి ఉండదు.

అలా కాకుండ గతం గొప్పదని కొందరూ, వర్తమానం గొప్పదని మరికొందరూ, శాస్త్రం గొప్పదని ఇంకొందరూ వాదించుకుంటూ రోగానికి మందుకనిపెట్టకుండా కాలక్షేపంచేస్తే, ఏదీ గొప్పది కాకుండ పోతుంది. సహజంగ ఎవరిమీదన్నా కోపం వచ్చినా లేదా శత్రువును తిట్టే విషయంలో, 'నువ్వు మందులేని వ్యాథి సోకి పోతావురా' అని కొందరు తిడుతుంటారు. ప్రస్తుతం మందులేని వ్యాథి ఏమిటో మన కనులముందు కనపడుతుంది. ప్రస్తుతం పరిశుభ్రత అనే మందుతో దీన్ని తరిమికొట్టాలి. ప్రభుత్వసూచనలతో ఆరోగ్యమే మహాభాగ్యమన్న దిశగ సాగిపోవాలి. మనింట్లో మనముండాలి. హింసకు తావులేకుండ సహనంతో కుటుంబ సభ్యులతో సఖ్యతగ ఉండాలి. శరీరానికి మనసుకు,మేథస్సుకు ఉల్లాసాన్నిచ్చే అహింసాయుత పనులతో యింటిల్లిపాదిని ఆనందింపంచెయ్యాలి.

కుటుంబమంతా
కలసికట్టుగ మసలండి
రోగంలేని మరో ప్రపంచాన్ని
ఆరోగ్యమే మహాభాగ్యమంటూ
మీ యింట్లోకి ఆహ్వానించండి -- వాగుమూడి లక్ష్మి రాఘవరావు -9849448947